# భావములోన బాహ్యమునందును

అన్నమాచార్య

భావములోన బాహ్యమునందును ।
గోవిందగోవింద యని కొలువవో మనసా ॥

హరి యవతారములే అఖిల దేవతలు ।
హరిలోనివే బ్రహ్మాండములు ।
హరినామములే అన్ని మంత్రములు ।
హరి హరి హరి హరి హరి యనవో మనసా ॥

విష్ణుని మహిమలే విహిత కర్మములు ।
విష్ణుని పొగడెడి వేదంబులు ।
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు ।
విష్ణువు విష్ణువని వెదకవో మనసా ॥

అచ్యుతుడితడే ఆదియు నంత్యము ।
అచ్యుతుడే అసురాంతకుడు ।
అచ్యుతుడు శ్రీవేంకటాద్రి మీద నిదె ।
అచ్యుత అచ్యుత శరణనవో మనసా ॥